# అడవి రాజ్యం

"ఏయ్ సుశీలా ! ఒకసారి ఇటు రావోయ్!" కేకేశాడు ఆనందరావు ఉక్కిరి బిక్కిరి అవుతూ...

"ఏమిటండీ ఆ తొందర!" అంటూ వంటింట్లో చారులో పోపు పెడ్తున్న పని ఆపి గ్యాసు మంట ఆర్పేసి బయటికి వచ్చింది సుశీల.

"మళ్ళీ లెక్కలు మొదలెట్టారా! అబ్బ ఎన్నిసార్లు పెన్షన్, గ్రాట్యుటీ వగైరా వగైరా అంత వస్తుందని, ఇంత వస్తుందని ఇప్పటికి ఆర్నెల్ల నుంచి రోజు లెక్క పెడ్తున్నారు. ఆఁ... ఇప్పుడు చెప్పండి అంతా కలిపి ఎంత వస్తుందో! అది చెప్పడానికే పిల్చారు గదా! మరి చెప్పండి" బాల్‌పాయింటు పెన్నుతో తలవంచి లెక్కలు చేస్తున్న భర్తను అడిగింది సుశీల.

ఆనందరావు మెల్లగా తలెత్తాడు. భార్య వైపు ఆనందంగా, చిలిపిగా చూశాడు. మళ్ళీ కాగితం మీదికి వంగి ఏదో సంఖ్య వ్రాసి రెండుసార్లు అండర్‌లైన్ చేశాడు.

"పెన్షన్ పోగా అంతా కలిపి మూడు లక్షల వరకు వస్తుందోయ్" కనుబొమ్మలు ఎగరేశాడు.

"మూడు లక్షలా! మొన్న రెండే అన్నారు" అంది సుశీల ఆశ్చర్యపోతూ.

"రెండు కాదు మూడు!"

"రెండు నుంచి మూడయిందీరోజు. మళ్ళీ రేపు ఒక్కటే అంటారు. ఆర్నెల్ల నుంచి ఇదే వరస. ఎవరైన బాగా తెలిసినతనితో లెక్కలు చేయించండి అని చెప్తున్నా వినడం లేదు"

"నేను లెక్కల టీచరును. నాకు వేరేవాళ్ళు లెక్కలు చేసి పెట్టడమేమిటి? అందరూ వచ్చి నన్ను లెక్కలడుగుతారు తెలుసా!"

"ఆ తెలుసు! కాని ఇవి ఆ లెక్కలు కావు గదా! ఈ రూల్సు, ఆ రూల్సు తెలిసి వుండాలి. ఈ లెక్కలు తెల్సినవాళ్ళు ఆ డబ్బు తొందరగా వచ్చే ఉపాయాలు చెప్పేవాళ్ళు వేరే ఉంటారట గదా?"

"ఇదంతా నీకెవరు చెప్పారు !" ఆశ్చర్యం నటించాడు ఆనందరావు. "రూల్సు లేవు ఏమి లేవు ఉన్నా నాకన్నీ తెలుసు విను ఆఖరిసారిగా చెప్తున్నాను. మూడు ముచ్చటగా మూడు లక్షలు వస్తాయి" నొక్కి చెప్పాడు ఆనందరావు.

"మళ్ళీ రేపు మరో లెక్క చెప్పకూడదు సరేనా!" నవ్వింది సుశీల.

"రోజుకో మాట మార్చేది నువ్వు! ఆ డబ్బుతో ఒకరోజు ఇది కొందాం అంటావు, ఇంకోరోజు అది కొందాం అంటావు" నవ్వాడు ఆనందరావు. చిరుకోపంతో మూతి తిప్పింది సుశీల.

ఆగష్టు ఫస్టుకు ఆనందరావు లెక్చరరుగా రిటైరు అవుతున్నాడు. రెండేళ్ళ నుంచే "రిటైర్‌మెంటు వచ్చేస్తుందోయ్" అంటూ భార్యతో రోజుకోసారైనా అంటుండేవాడు. చివరకు రిటైరుమెంటు రానే వచ్చింది.

"అటే యాభై ఎనిమిదేళ్ళు నిండాయన్నమాట! అంతవరకు ఉత్సాహంగా శక్తివంతంగా పనిచేసిన వ్యక్తికి రిటైరుమెంటు అయిన క్షణంతో నీరసం వచ్చేస్తుంది. రిటైరుమెంటు అనే పదం ఉచ్చరిస్తే కొందరు జడుసుకుంటారు. అసలు రిటైరుమెంటు అనేది ఉండకుంటే బాగుండేదేమో!"

"ఆ... అబ్బాయి చెప్పాడు. అమెరికాలో రిటైరుమెంటు అనేది ఉండదట. వాళ్ళ వాళ్ళ ఇష్టాన్ని బట్టి ఎన్నేళ్ళయినా పని చేయవచ్చట! అట్లా మనదేశంలో ఉంటే ఎంత బాగుండును! అయినా వాళ్ళ దేశం వేరు. వాళ్ళ మనుషులు వేరేమో! ఆ... మన మనుషులకేమైంది. మనమూ డెబ్భై, ఎనభై వరకు బతుకుతూనే ఉన్నాం. అరవై డెబ్భై వచ్చినా మునుపటిలా ముసలివాళ్ళు కావడం లేదు. అందుకే సుశీల రిటైరైన తర్వాత ఏదైనా చెయ్యండి అని అంటున్నది" ఆలోచనల్లోంచి బయటికి వచ్చి ఆనందరావు భార్య వైపు చూసాడు.

"ఈ డబ్బుతో ఏం చేద్దాం చెప్పు" అడిగాడు.

"మీ డబ్బు మీరేం చేసుకుంటారో చేసుకోండి" అంది సుశీల.

ఆమె గొంతులో కోపం ధ్వనించింది. అది తెచ్చి పెట్టుకున్న కోపమా ఆనందరావుకు అర్థం కాలేదు. ఆనందరావు రిటైరు అయినాక ఇంత డబ్బు వస్తుంది అంత డబ్బు వస్తుంది అన్నప్పుడల్లా సుశీల దాంతో ఏం చేయాలో చెప్తూనే ఉంది. మళ్ళీ భర్త ఆ ప్రశ్న కొత్తగా అడిగేసరికి ఆమెకు కోపం వచ్చింది. ఆనందరావు అదేది గమనించనట్లుగా ఉండిపోయాడు. తను చెప్పినవేవి భర్తకు జ్ఞాపకమున్నట్లు లేవు అని సుశీలకు నిజంగానే కోపం ముంచుకు వచ్చింది.

"మగవాళ్ళంతా ఇంతే. ఆడవాళ్ళ మాట పట్టించుకోరు" అని మనస్సులోనే విసుక్కుంది సుశీల.

వాళ్ళకిద్దరు కొడుకులు. ఇద్దరూ ఇంజనీరు చదువులు చదివారు. ఒకరి తర్వాత ఒకరు అమెరికా వెళ్ళిపోయారు. వాళ్ళు వెళ్ళిపోయి పది పన్నెండేళ్ళయింది. అప్పటి నుంచి వాళ్ళిద్దరే ఉంటున్నారు. మధ్యలో వచ్చి వాళ్ళు పెళ్ళిళ్ళు చేసుకొని వెళ్ళిపోయారు. వాళ్ళకు పిల్లలయ్యారు. వచ్చినప్పుడు టెలిఫోనులో మాట్లాడినప్పుడూ మళ్ళీ తిరిగి వస్తాం. ఏదైనా

వ్యాపారంగాని, ఇండస్ట్రీ గాని పెట్టుకుంటాం అంటారు కాని ఇంతవరకు వాళ్ళు వచ్చే జాడలు మాత్రం కన్పించడం లేదు.

ఆనందరావు రిటైరు అవుతున్నాడేగాని ఆరోగ్యంగా బలంగా ఉంటాడు. అంత వయస్సు ఉన్నట్లు కనిపించడు. సుశీలా అంతే. ఎదిగిన కొడుకులకు అక్కలాగా కనిపిస్తుంది.

''ఇప్పుడే ఇంట్లో కూర్చోమంటే దాంతోనే ముసలివాళ్ళమైపోతామండి. ఏదైనా వ్యాపకం పెట్టుకోవాలి'' అని సుశీల మాటిమాటికి అంటూనే వుంది.

''ఏం చేద్దాం!'' అని నసుగుతాడు ఆనందరావు.

''ట్యూషన్లు చెప్పండి ఇంట్లో. లెక్కలకు ఈకాలంలో బాగానే డిమాండ్ ఉంది.''

''పొద్దున్నొక బ్యాచి సాయంత్రమొక బ్యాచి స్టూడెంట్స్‌ను తీసుకున్నా మీకు పొద్దు పోతుంది. ఆదాయమూ ఉంటుంది'' అంది సుశీల.

''అబ్బ! ముప్ఫై ఆరేళ్ళనుంచి అదేగా చేశాను. కొత్తవాళ్ళు వస్తున్నారు. ఆ డబ్బేదో వాళ్ళు సంపాదించుకోని! ఆఁ... అన్నట్టు నీకు చిన్న తోటేదో పెట్టుకోవాలని, అందులో ఉండాలని కోరిక ఉండేది గదా! ఆ పని చేస్తేనో!'' అన్నాడు ఆనందరావు.

ఈ మాటలంటున్నది తన భర్తేనా! మొదట సుశీల నమ్మలేదు. కాని ఆనందరావు ముఖం చూసి అతడు వేళాకోళానికి కాదు నిజంగానే అంటున్నాడని ఆమె గ్రహించింది.

సుశీల తండ్రి భూస్వామి. ఆయనకు తోటల పెంపకమంటే ఇష్టముండేది. ఓ మామిడితోట, ఓ పూలతోట పెట్టించాడు. సుశీల చిన్నప్పుడు ఆ తోటలకు వెళ్ళేది. మోట బావి నుంచి తోడిన నీళ్ళు పిల్లకాలువలుగా పారేయి. జలజలా పారే ఆ పిల్లకాలువల వెంట చెట్లనీడలో మైమరిచి ఆడుకున్న చిన్ననాటి రోజులు పూర్వజన్మ వాసనలుగా ఆమె మనస్సులో లోలోపల మధురస్మృతులు ఉండిపోయాయి.

చెట్లకు నిండుగా వేళ్ళాడుతున్న పళ్ళు, గుత్తులుగా పూసిన రంగురంగుల పూలు, పూల వాసనలు ఆమెకు ఇప్పటికీ జ్ఞాపకాని వస్తుంటాయి. అందుకే భర్త రిటైరయ్యాక ఇంత భూమి కొనుక్కొని దాన్లో పూల, పళ్ళ చెట్లు పెట్టుకొని ఆ చెట్ల మధ్య ఓ చిన్న కుటీరంలాంటి ఇల్లు కట్టుకొని ఉండాలని కోరిక మెల్లమెల్లగా గూడు కట్టుకుంది. కొడుకులా ఇప్పుడే ఈ దేశానికి వచ్చేట్లు లేరు. తామా ! అమెరికాకిపోయి అక్కడ ఉండలేరు. అందుకే ఏదో తోట పెంపకంతో కాలక్షేపం చేస్తూ తృప్తిగా, ఆనందంగా, ప్రశాంతంగా గడపాలని సుశీల అనుకుంది.

సుశీల కోరికను ఆనందరావు ఇంతకుముందు చాలాసార్లు విన్నాడు. గొంతెమ్మ కోరిక అని కొట్టి పారేశాడు. కాని ఇప్పుడు ''అది బాగానే ఉంది!'' అని అతనికనిపించింది. చెట్లు పెంచడం ఎంతో అవసరమున్నదీ కాలంలో. ఇండ్లే ఇండ్లు తప్ప మొక్కలు లేకుండా పెరిగిపోతున్న నగరాన్ని చూసి చూసి అతనికి సుశీల చెప్పేది చేస్తే బాగుంటుందనిపించింది.

ఆనందరావు ఎక్కువ ఎప్పుడూ పల్లెటూళ్ళలో లేడు. తల్లీ తండ్రీ అతన్ని చదివించాలని టౌనులో హాస్టల్లో వేశారు. సెలవుల్లో వచ్చినా అతడు వ్యవసాయం గురించి అంత పట్టించుకునే వాడు కాదు. కాని పూలచెట్లన్నా, పళ్ళచెట్లన్నా అతనికి ఇష్టమే. వాటి నడుమ నివసించడం ఊహించుకుని ఇది బాగానే ఉంటుందనుకున్నాడు ఆనందరావు. అతని హృదయం సరళమైంది. ఏ చిక్కులు తెలియని వాడు కాబట్టే లెక్చరర్ ఉద్యోగంలో నెగ్గుకొచ్చాడు. ఏ ఆఫీసు ఉద్యోగమైనా అతడు దానికి తగినవాడు కాకపోయేవాడు. అసలు ఎవరైనా తమతమ స్వభావానికి తగిన పనులు ఎన్నుకుంటారేమో! అందుకే ఆనందరావు చదువులో ఎంత బాగున్నా తమ కొడుకు పెద్ద ఆఫీసరవుతాడని తల్లిదండ్రులు కలలు కన్నా లెక్చరర్ ఉద్యోగంలో స్థిరపడిపోయాడు. క్లాసులో పిల్లలకు లెక్కలు చెప్పడం, వాళ్ళకు రాని చిక్కులెక్కలను విప్పి చెప్పడంలో అతనికి మహదానందం కలిగేది. అట్లా ముప్ఫైయారేళ్ళ సర్వీసులో అతడు ఆ మహదానందాన్ని ఆస్వాదిస్తూనే బతికాడు. ఇప్పుడిక భార్య చెప్పినట్లుగా వానప్రస్థాశ్రమం లాంటి జీవితాన్ని గడపాలని నిశ్చయించుకున్నాడు.

భూమి అమ్మకాలు, కొనడాలు వృత్తిగా పెట్టుకున్నవాళ్ళు ఇప్పుడు చాలామంది ఉన్నారు. "ఆ వృత్తిలో లక్షలు, కోట్లు సంపాదించిన వాళ్ళున్నారు. వాళ్ళల్లో కోటేశ్వరరావు గుర్తుకు వచ్చాడు ఆనందరావుకు. అతను తెలిసినవాడు. పక్కింట్లో వుండేవాడు మోసమేమి చేయడు. నమ్మకంగా చూసి పెడ్తాడు" అనుకున్నాడు.

తోట కొనం భూమి చూడమని ఆనందరావు అతనికి చెప్పాడు.

"తోట కోసమా? ఏ ఇల్లో, ప్లాటో అయితే బాగుంటుంది" సలహా ఇచ్చినట్లుగా అన్నాడు కోటేశ్వరరావు సుశీలవైపు చూస్తూ.

"ఇప్పుడు కిరాయి ఇంట్లో ఉంటున్నాం. కాని ఆ ఇల్లేదో తోటలో కట్టుకోవాలని ఉంది మా ఆవిడకు" ఆనందరావు భార్యవైపు చూస్తూ చిరునవ్వు నవ్వాడు.

"ఓహో! తోటలో ఇల్లు కట్టుకొని ఉండాలని వదినగారి కోరికన్న మాట! బాగుంది! కానీ..." కాస్సేపాగాడు కోటేశ్వరరావు.

"ఏమిటి? తోటకు కావల్సినంత భూమి నగర శివార్లలో దొరకదంటారా?" ఆతురతగా అడిగింది సుశీల.

"అదికాదమ్మా. దొరకదని ఏమీలేదు. హైదరాబాద్ చుట్టూ భూములే. కాని రిటైర్ అవుతున్నారు కదా! ఆ బాదరబందీ ఎందుకు? హాయిగా ప్లాటు కొనుక్కొని ఇల్లు పోర్షన్లుగా కట్టుకొని ఓ పోర్షన్‌లో మీరుండి మిగతావి కిరాయిలకిచ్చుకుంటే మీకు బోలెడు డబ్బు" తన అభిప్రాయం చెప్పాడు కోటేశ్వరరావు.

ఇంటి చుట్టూ ఇంత జాగా కూడా వదలకుండా కిక్కిరిసినట్లుగా చిన్నచిన్న గదులతో ఇండ్లు కట్టి కిరాయిలకు ఇస్తుంటారు. అది సుశీలకు నచ్చదు. ఇంటి ముందు, వెనుకా ఇంత జాగా ఉండాలి. ఇంటి ముందు పూలచెట్లు, ఇంటి వెనుక కూరగాయల పాదులు,

మొక్కలుండాలి. ఇల్లంటే అలా కట్టాలి కాని, కిక్కిరిసినట్లు డబ్బు కక్కుర్తితో ఇల్లు కట్టడం సుశీల కిష్టంలేదు. ఇదంతా ఆలోచిస్తుండగానే కోటేశ్వరరావు అన్నాడు -

"మీకు తోట వేసుకోవాలనుకుంటే సరే! భూమి చూస్తాను"

"భూమి మరీ దూరంగా ఉండకూడదు కోటేశ్వరరావుగారూ! పట్నానికి దగ్గరగా ఉండేటట్లు చూడండి. కాస్త బస్సు సౌకర్యమున్న భూమి అయితే మంచిది" అన్నాడు ఆనందరావు.

"భలేవాడివయ్యా!" పెద్దగా నవ్వాడు కోటేశ్వరరావు. "మరి తోట వేసుకునేంత భూమి కావాలంటే పట్నానికి దూరంగా పోవలసివస్తుంది. పట్నానికి చుట్టూ అరవైమైళ్ళ దాకా నీకు భూములెక్కడ దొరుకుతాయి. వ్యవసాయ భూమిలన్నీ ఇంటి ప్లాట్లు అయ్యాయి. నయానో భయానో రైతులు భూములమ్ముకుని పట్నంలో ఇళ్ళు కట్టుకుంటున్నారు. కొందరు వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఇంకా కొందరు రెంటికి చెడ్డ రేవడులై తిరుగుతున్నారు. అదీ పరిస్థితి! సరే మీరిద్దరూ తోట వేసుకుని ఆ తోటలో ఓ చిన్న కుటీరంలాంటి ఇల్లు కట్టుకుని ప్రశాంతంగా ఉండాలనుకుంటున్నారు. రిటైరైన డబ్బు ఉంది. దానికేం లోటు లేదు. కావాలంటే మీ అబ్బాయిలను డాలర్లు పంపమని అడగవచ్చు."

"మా అబ్బాయిలను డబ్బు అడిగి వాళ్ళను ఇబ్బంది పెట్టాలని లేదు. ఉన్న డబ్బుతోనే అంతా సర్దుకొని స్థిరపడాలని మా ఉద్దేశం" అంది సుశీల.

"ఎట్లా అయినా ఫరవాలేదు. భూమి కావాలన్నారు కదా! అది నాకు వదిలిపెట్టండి. కాని నాకు వారంరోజులు టైం ఇయ్యండి చాలు! వెంటనే రిజిష్టరయ్యే భూమి మీకు నేను చూసి పెడ్తా ! సరేనా! వదినగారు!" కోటేశ్వరరావు సుశీలవైపు చూశాడు.

సుశల తన కల ఫలించే రోజులొస్తున్నాయని సంతోషంగా నవ్వింది.

కోటేశ్వరరావు వాగ్దానం చేసినట్లుగానే వారంరోజులకు వచ్చాడు. అక్కడ భూమి ఉంది ఇక్కడ భూమి ఉంది అని జాడలు తెచ్చాడు. కోటేశ్వరరావు వృత్తి అదే కాబట్టి అన్ని వివరాలతో వచ్చాడు.

"చెప్పండి ! తోటకు భూమి మీకు ఎక్కడ కావాలంటే అక్కడ దొరుకుతుంది! ఎక్కడ తీసుకుంటారో చెప్పండి!" అని కోటేశ్వ్రరావు భూమి వివరాలు చెప్పాడు. కొన్ని పట్నానికి అరవైమైళ్ళు దాటి ఉంటే కొన్ని నలభై మైళ్ళలోనే ఉన్నాయి. చివరకు సుశీల, ఆనందరావులు పట్నానికి కాస్త దగ్గరగా ఉన్న బస్సు సౌకర్యమున్న భూమిని ఎన్నుకున్నారు.

"ఎకరం ఎట్లా అంటున్నారు" అడిగింది సుశీల.

"మీరు ఎన్ని ఎకరాలు కావాలన్నా తీసుకోవచ్చు. ఐదా పదా ఇరవయ్యా? లేకపోతే నూరా?"

"అయ్యో! అన్ని ఎకరాలు మాకెందుకండి. ఇంతకు ఎకరం భూమిధర ఎంత?" అడిగింది సుశీల భయంగా. ఎంత చెప్తాడో ఏమో అనుకొని 'ఎకరం లక్ష అనడు కదా!' అనుకుంది మనసులో.

"ధర గురించి మీరు ఆలోచించకండి. పట్నానికి దగ్గర ఇంత భూమి దొరకదు. దొరికి నప్పుడే కావల్సినంత తీసుకోండి" అన్నాడు కోటేశ్వరరావు.

'భూమి ధర చెప్పక ఇవన్నీ మాటలేంటి' మనసులో విసుక్కున్నాడు ఆనందరావు. ఎంత చెప్తాడో ఏమో అని సుశీలకు భయంగా వుంది.

"ధర ఎంతో ముందు చెప్పండి" అంది సుశీల.

"ధర గురించి ఆలోచించవద్దని చెప్తున్నానా! ధర ఎంతో లేదు. అది ఒక రైతుది. సాగు చేసిన చెలక. మీరు ముళ్ళకంపలు నరుక్కోవలసిన అవసరం లేదు. భూమి తోటకు రెడీగా చదును చేసి వుంది. చుట్టూ కంచె పెట్టుకొని బోరు వేసుకుంటే చాలు. మీరు కోరుకుంటున్నట్లుగా ఓ చిన్న కుటీరం లాంటి ఇల్లు కట్టుకొని హాయిగా మీరక్కడ చెట్లు చేమలు పెంచుకుంటూ ఉండవచ్చు. మిమ్మల్ని 'కౌన్ హై' అనే వాడుండడు" చెప్తుపోతున్నాడు కోటేశ్వరరావు. అతని వాక్ ప్రవాహాన్ని ఆపుతూ ఆనందరావు

"కోటేశ్వరరావుగారు ! ముందు భూమి ధర ఏమిటో చెప్పండి. దాన్నిబట్టి మేము ఆలోచిస్తాం" అన్నాడు.

కోటేశ్వరరావు తన వాక్ప్రవాహాన్నాపి సుశీలవైపు ఆనందరావు వైపు చూశాడు. "ధర ఎకరానికి ఎంతో లేదు యాభైవేలు" అన్నాడు.

"యాభైవేలా?" అంది సుశీల వెంటనే.

అవును ప్లాట్ల ధరలు చూస్తున్నాం కదా! అవి మండిపోవడం లేదా? ఇక మరి తోటకు భూమి ఎకరానికి యాభై వేలంటే ఎక్కువేమి కాదు అనుకున్నాడు ఆనందరావు. యాభై వేలు! బాగానే ఉంది "సుశీలా ! ఒకసారి మనం భూమి చూసివద్దాం. అప్పుడు నిర్ణయించుకుందాం" అన్నాడు పైకి.

"యాభైవేలు ! ఏమి తగ్గించడా?" ఆశగా సుశీల కోటేశ్వరరావు వైపు చూసింది.

"అయ్యో తల్లీ అన్నీ నేను మాట్లాడి బేరం చేసింతర్వాతే ఆ రైతు ఈ ధరకు ఒప్పు కొన్నాడు. ధర విషయంలో మీరేమి అనుమానపడకండి. ఇది మీకు చాలా చవకగా వస్తున్నది. మరో చోటికి పోతే ఎకరానికి లక్ష మూడు లక్షలంటున్నారు. కళ్ళు మూసుకొని ధర గురించి ఆలోచించ కుండా ఈ భూమి తీసుకోండి! ఎన్ని ఎకరాలు తీసుకుం టారు?" అడిగాడు కోటేశ్వరరావు.

"ముందు భూమి చూద్దాం. ఆ తర్వాత చెప్తాం" అన్నాడు ఆనందరావు.

ఒకరోజు కోటేశ్వరరావు జీపు తెచ్చి సుశీల, ఆనందరావులను భూమి చూపించడానికి తీసుకెళ్ళాడు. పట్నం నుంచి మంచి రోడ్డు ఉంది. మరీ దూరంగా లేదు. భూమి కూడా చదును చేసి చక్కగా ఉంది. ఎక్కడా ఒక్కరాయి లేదు. ఎర్రగా కుంకుమపువ్వు పరచినట్లుగా ఉంది.

"ఎర్రభూమి తోటలకు మంచిదండి" సుశీల కానందం పట్టలేకుండా ఉంది.

ఎక్కడ ఏ చెట్లు వేయాలి? ఎక్కడ కూరగాయల మొక్కలుండాలి. ఎక్కడ ఇల్లు కట్టుకోవాలి? అన్నీ చకచకా సుశీల ఊహించుకుంటూ ఆ భూమివైపే చూస్తూ నిల్చుండిపోయింది. సుశీల తన్మయత్వం చూసి

"భూమి నచ్చిందా వదినగారు!" అడిగాడు కోటేశ్వరరావు.

"చాలా బాగుందండి. ఏమండీ!" అని సుశీల భర్తవైపు చూసి "ఆలస్యం చేయొద్దు వెంటనే డబ్బిచ్చి రిజిస్ట్రేషను చేయించుకుందాం" అంది. ఆమె తన కలలు ఫలించే రోజు ఎంతో దూరంలో లేదనుకుంది. ఆనందరావు అటుఇటు చూస్తూ ఆ భూమి ఎవరిది, ఈ భూమి ఎవరిది అని అడుగుతున్నాడు.

"ఈ భూమి గురించి ఏం చిక్కుల్లేవు కదా! అంతా క్లియరుగానే ఉందా?" అడిగాడు ఆనందరావు.

"అంతా క్లియరే. ఎందుకు మీకు పట్టా కాగితాలు తెచ్చి చూపిస్తాను. చూశాకే నిర్ణయం తీసుకోండి. పక్కపక్క ఇన్నాళ్ళ నుంచి ఉంటున్నాం. నన్ను అనుమానిస్తున్నారా? మీరేం ఆ విషయంలో భయపడే అవసరం లేదు. నిశ్చింతగా డబ్బు ఇవ్వండి వెంటనే రిజిస్ట్రేషను చేయించుకోండి" అన్నాడు కోటేశ్వరరావు.

సుశీల, ఆనందరావులకు భూమి నచ్చింది. వాళ్ళ దగ్గరున్న డబ్బును బట్టి నాలుగెకరాలు తీసుకోవాలనుకున్నారు. రెండు లక్షలు భూమికి అవుతుంది. రిజిస్ట్రేషన్‌కు కొద్దిగా ఉంటుంది. పోగా మిగిలిన లక్ష రూపాయలు కంచె, బోరు, ఇల్లు, కొన్ని మొక్కలు నాటడానికి సరిపెట్టుకోవాలి. ఇకపోతే నెలనెలా పెన్షన్ వస్తుంది. తోట మీద ఏదైనా ఆదాయం వచ్చేంతవరకు పెన్షన్‌తో నడుపుకోవాలి అని అనుకున్నారు.

కోటేశ్వరరావు రైతుకు డబ్బు ఇప్పించి వెంటనే రిజిస్ట్రేషన్ తతంగం పూర్తి చేశాడు. రిజిస్ట్రేషన్ ఆఫీసుకు సుశీల, ఆనందరావు వెళ్ళారు. అనుకున్న టైంకు కోటేశ్వరరావు రైతును తీసుకువచ్చాడు. అమ్మకం చేసినట్లుగా కాగితాలు ఆఫీసు బయటి ప్రాంగణంలో ఉన్నవాళ్ళే టైపు చూసి ఇచ్చారు.

"ఈ కాగితాల మీద మీరు సంతకం చేయండి" అని కోటేశ్వరరావు టైపు అయిన స్టాంపు పేపర్లు తెచ్చాడు.

"భూమి సుశీల పేర కొంటున్నాం కద" అని భార్యవైపు చూసి "నువ్వు సంతకం చేయి" అన్నాడు ఆనందరావు.

సంతకం అయిన తర్వాత కోటేశ్వరరావు లోపలికెళ్ళి కొంతసేపటికి బయటికి వచ్చాడు. స్టాంపు కాగితం మీద ఏవో ముద్రలున్నాయి.

"ఇదిగో! రిజిస్ట్రేషన్ అయిపోయింది. మరి నాకివ్వవలసిన కమీషన్!"

కోటేశ్వరరావు కమీషన్ డబ్బు ఆనందరావు తెచ్చాడు. షర్టు లోపలి జేబులోంచి తీసి ఆ డబ్బు ఇచ్చాడు.

"మరి ఆఫీసు మామూళ్ళు అవి లేంది పని కాదుగా. అదీ ఇంత తొందరగా" అని పళ్ళు బయటపెట్టి ఏ ధ్వని లేకుండానే నవ్వాడు కోటేశ్వరరావు. ఏ చప్పుడు లేని ఇటువంటి నవ్వు చాలా ప్రమాదకరమైందని ఆనందరావు ఎప్పుడో ఎక్కడో చదివాడు. అది జ్ఞాపకం వచ్చింది. ఆ డబ్బు ఇవ్వాలనిపించలేదు. ఇష్టం లేకున్నా "ఎంత?" అని అడిగాడు.

కోటేశ్వరరావు చెప్పాడు.

"అబ్బ! అంతనా?" అనుకున్నాడు ఆనందరావు మనస్సులోనే. డబ్బు తీసి ఇచ్చాడు.

చేతిలో డబ్బు ఉంది కాబట్టి వెంటనే ఆనందరావు భూమి చుట్టూ కర్రలు పాతి, ముళ్ళ తీగెను చుట్టించాడు. బోరు వేయించాడు. రెండు గదులున్న చిన్న పెంకుటిల్లు కట్టించాడు. అక్కడక్కడా చిన్నచిన్న ఇళ్ళు ఉన్నాయి. బస్సుల రాకపోకలున్నాయి. మనుషులు తిరుగుతూ కనిపించారు. భయం లేదు. అందుకని ఊళ్ళో ఇల్లు ఖాళీచేసి ఆ ఇంటికి వెళ్ళిపోయారు.

లేవగానే తాజా గాలి! ప్రశాంతమైన వాతావరణం. పచ్చని పరిసరాలు సుశీల కదంతా ఎంతో ఆనందాన్నిచ్చింది. ఆనందరావు కూడా పొద్దున్నే లేచి భూమంతా చుట్టేసి వస్తున్నాడు.

మృగశిరకార్తె వచ్చింది. అంతకుముందే కొబ్బరి, మామిడి, జామ, సపోటా మొదలైన మొక్కల కోసం ఆనందరావు గుంటలు తీయించాడు. ఎరువు తెప్పించి నింపించాడు. మొదటి వాన పడగానే సుశీల పాదులు తీయించి రకరకాల కూరగాయల విత్తనాలు వేయించింది. పళ్ళ మొక్కలు నాటారు.

"నాకిక్కడ ఏం పని లేదనిపిస్తుందండి. అందులో వచ్చేపోయేవాళ్ళు, మాట్లాడే అమ్మలక్కలు లేరుగదా అంతా తీరికగా ఉన్నట్లుంది. ఒక బర్రెను కొనుక్కుందాం. మనకూ లేవగానే తాజాపాలు కాఫీకి ఉంటాయి. మనం వాడుకోగా మిగిలినవి అమ్ముకోవచ్చు. ఇక్కడ రోడ్డు మీదికి పాలవ్యాన్ వస్తుందట" అంది సుశీల ఒకరోజు.

"అది సరే! మళ్ళీ బర్రె అదీ అనేసరికి ఓ మనిషి జీతగాడు కావల్సి వస్తాడు. ఇప్పుడు కూలివాళ్ళతో సరిపెట్టుకుంటున్నాం" ఆలోచనగా అన్నాడు ఆనందరావు.

"ఓ మనిషి ఉంటే మంచిదే కదండీ! మనకూ ఒక తోడు ఉంటుంది"

"సరే! కాని డబ్బంతా అయిపోయిందే" వెనుకా ముందాడాడు ఆనందరావు.

"అప్పుడే మూడు లక్షలూ అయిపోయాయా?" అంది సుశీల ఆశ్చర్యంగా.

"ఇదిగో చూడు లెక్క రాసి పెట్టాను"

"ఆ లెక్కలన్నీ నాకెందుకు?" ఆలోచించింది సుశీల.

"ఇదిగో నా బంగారు గాజులున్నాయి కదా, అవి అమ్మి బర్రెను కొనుక్కురండి" అని చేతి నుంచి గాజులు తీసిచ్చింది సుశీల.

"ఇప్పుడు గాజులమ్మడం ఎందుకు?" ఆనందరావుకది ఇష్టం లేదు.

"అమ్మితే ఏమిటండీ! మళ్లీ ఆదాయం వచ్చాక కొనుక్కోవచ్చు" అంది సుశీల.

ఆనందరావు బర్రెను తెచ్చిన తర్వాత సుశీలకు చేతినిండా పని అయింది. కూరగాయల మొక్కలు లేచాయి. వాటికి పాదులు తవ్వడం, తీగలు పాకడానికి కర్రలు పాతడం, పందిళ్ళు వేయడం జీతగాని సాయంతో చేసింది. అక్కడక్కడా బంతిచెట్లు లేచాయి. సుశీలకు చిన్ననాటి మిరప తోటల్లోని బంతిచెట్లు గుర్తుకు వచ్చాయి. "పచ్చని ఎర్రని మిరపతోటలో పసుపుపచ్చ బంగారం రంగులో బంతిపూలు ఎంత అందంగా ఉండేవి! మోటబావి దగ్గర పూసిన బంతిపూలు దీపావళికీ, సంక్రాంతికీ దండలుగా గుచ్చి తను ఇంటి గుమ్మాలకు, ఎద్దుల కొమ్ములకు అలంకరించేది!" అది మనస్సులో కనిపించి సుశీల పులకరించింది.

"బంతిపూలు పూచాక అన్నీ గుచ్చి గుమ్మాలకు వేలాడదీయాలి!" అనుకుంది.

ఆనందరావు తన పెన్షన్ నుంచే జీతగానికి జీతం ఇస్తున్నాడు. వాళ్ళ ఇంటిఖర్చు ఆ డబ్బుతోనే జరుగుతున్నది. ఆనందరావు స్నేహితులు, సుశీల ఇరుగుపొరుగు స్నేహితులు వాళ్ళింటికి వచ్చారు.

"నీ రిటైరుమెంటు జీవితం చాలా బాగుందోయి" అని ఆనందరావు స్నేహితులు అభినందించారు. సుశీల స్నేహితులు ఈర్ష్యపడ్డారు. అయినా అది దాచుకొని "చాలామంచి పని చేశావ్ సుశీలా!" అన్నారు.

"అమెరికా నుంచి మా అబ్బాయిలు ఈ బాదరబందీ పెట్టుకోకు నాన్నా! అని ఉత్తరాలు రాశారు. అయినా తెగించామనుకోండి!" నవ్వాడు ఆనందరావు.

ఆరోజు రాత్రి సుశీల, ఆనందరావులు ముచ్చట్లు చెప్పుకుంటూ ఉండిపోయి చాలా ఆలస్యంగా నిద్రపోయారు. వాళ్ళు లేచేసరికి సూర్యుని వేడి కిరణాలు అంతటా వ్యాపించాయి. "అరే! పొద్దుపోయిందే! జీతగాడు కూడా మనల్ని లేపలేదు" అనుకుంటూ బయటికి వచ్చాడు ఆనందరావు. అటు ఇటు చూశాడు. ఏదో ఖాళీగా కన్పించింది. బర్రె ఉండే పాకవైపు చూశాడు.

"అయ్యో! బర్రే దూడెల్లేవు!" నోరు తెరిచాడు ఆనందరావు. మబ్బులోనే పాలు పితకడానికి చేరుకుంటానని చెప్పి జీతగాడు వాళ్ళ అక్క ఇంటికి దగ్గరలోనే ఉన్న ఊరికి వెళ్ళాడు.

"లక్కయ్య ఇంకా రాలేదు! మరి బర్రే దూడెలు ఏమైనట్లు!" అటు యిటు దూరంగా దృష్టి సారించి పరిశీలనగా చూశాడు ఆనందరావు.

బర్రే, దూడెలు ఎక్కడా కన్పడలేదు. దూరంగా లక్కయ్య వస్తూ కన్పించాడు. ఆనందరావు వాడికి ఎదురుగా గబగబా నడిచి వెళ్ళాడు. "బర్రే, దూడలు ఏవి?" అడిగాడు ఆతురతగా.

ఇంతలో సుశీల బయటికి వచ్చింది. "ఏమైందండీ!" అని అడిగింది.

"బర్రె దూడ రెండూ కన్పించడం లేదు" అన్నాడు ఆనందరావు. ఆయన గొంతులో కంగారు ధ్వనించింది. కళ్ళల్లో దైన్యం ప్రవేశించింది. లక్కయ్య అటు యిటు పరిశీలనగా చూసి "బర్రెనూ దూడెనూ ఎవరో తోలుకొని పోయింద్రు" అన్నాడు.

"తోలుకొని పోవడమేమిటిరా!" కంగారుపడ్తూ అడిగింది సుశీల.

"బర్రెనూ, దూడనూ ఎవరో ఎత్తుకొనిపోయింద్రు" అన్నాడు లక్కయ్య.

"అంటే దొంగతనమా!" బిక్కమొహాలతో అడిగారు సుశీల, ఆనందరావులు ఒకేసారి.

"గదేనండి! లేకపోతే కట్టేసిన పలుపుతాళ్ళు గుంజలకే ఉన్నాయి. మరి ఎక్కడికి పోతాయి!" సుశీలకు ఏడుపు ముంచుకు వచ్చింది. ఆనందరావు కన్నీళ్ళు కార్చలేదంతే.

ఆ రోజంతా సుశీల, ఆనందరావులు నిరుత్సాహంగానే ఉన్నారు. బర్రె దూడెలు లేకపోతే ఏం పని లేనట్లుగానే ఉంది. లక్కయ్య కూరగాయల పాదుల్లో, పండ్ల చెట్ల పాదుల్లో కలుపు తీస్తూ బయటనే ఉండిపోయాడు.

"ఊరికి ఇంత దగ్గరగా ఉన్నా ఏమీ రక్షణ లేదండి. పాకలో కట్టేసిన వాటిని ఎట్లా తోలుకపోతారు!" మాటిమాటికీ ఇవే మాటలంటూ సుశీల ఏ పనీ ముట్టుకోకుండా కుర్చీలో కూర్చుండిపోయింది. ఆమెకు అమ్మిన గాజులు గుర్తుకు వచ్చి దుఃఖం వస్తోంది.

"అయినా తోలుకుపోతుంటే అరవను కూడా అరవలేదండి" అంది సుశీల.

"అవి అరవకుండా వాళ్ళేమైనా చేసి ఉంటారు" ఆనందరావు ఒక్కచోట కూర్చోలేక పోతున్నాడు. అటుయిటు పచార్లు చేస్తున్నాడు.

బర్రే దూడెలు పోయి రెండు రోజులయింది. ఈ రెండు రోజులు సుశీల, ఆనందరావులు ఇంట్లో ఎవరో పోయినట్లుగానే విచారంగా ఉన్నారు. మూడోరోజు పొద్దున సుశీల, ఆనందరావులు ఇంటి ముందు తిరుగుతున్నారు. జీతగాడు లక్కయ్య మోటారు ఆన్ చేసి మొక్కలకు నీళ్ళు పెడ్తున్నాడు. ఈ రెండు నెలల్లో మొక్కలు బాగానే మారాకు వేసి పచ్చగా ఎదిగాయి. ఒకటి రెండు మామిడి, జామ మొక్కలు ఎండిపోతే వెంటనే కొత్త మొక్కలు తెచ్చి వేశారు. కూరగాయల మొక్కలు తీగలు కూడా పచ్చగా బాగా ఎదుగుతున్నాయి. 'నేల మంచిదే' అనుకుంది సుశీల.

లక్కయ్య మొక్కలకు కాలువలు మళ్ళిస్తూ ఇంటి వెనకాలకు వెళ్ళిపోయాడు. పసుపు, ఎరుపు రంగులను పులుముతున్న సూర్యోదయం కాంతిలో సుశీల, ఆనందరావులు ప్రకృతి అందాలను చూస్తూ తన్మయులైపోయి వున్నారు. ఇంతలో నలుగురు మనుషులు వచ్చి నిశ్శబ్దంగా వాళ్ళ ముందు నిల్చున్నారు.

వాళ్ళు ఎప్పుడు ఎక్కడి నుంచి వచ్చారో సుశీల, ఆనందరావులు గమనించనే లేదు. పహిల్వాన్లలాగా ఉన్న వాళ్ళను చూస్తే సుశీలకు భయమేసింది.

"ఎవరండి మీరు. ఎవరు కావాలి మీకు" అడిగాడు ఆనందరావు.

"ఈ జాగా ఖాళీ చేసి ఎప్పుడు పోతారో చెప్పండి!" నలుగురిలో ఒకడు అడిగాడు.

"ఖాళీ ఎందుకు చేస్తాం. ఈ జాగా మేం కొనుక్కున్నాం. మాది ! రెండు నెలలకు పైగా ఇక్కడే ఉంటున్నాం" ధైర్యం కూడగట్టుకొని అన్నాడు ఆనందరావు.

"ఈ జాగా మీదా! ఏది మళ్ళా మాట్లాడు!" అంటూ ఒకడు ఆనందరావు మెడ దగ్గర షర్టు పట్టుకున్నాడు.

"ఎవరు మీరు? ఎందుకిట్లా చేస్తున్నారు ! పోలీసులను పిలుస్తాం. ఓ లక్కయ్యా! లక్కయ్యా! ఇటు రా" పిలిచింది సుశీల.

"పోలీసులను కాదు వాడి అబ్బగాడిని పిల్చుకో మాకేం భయం లేదు. కాని తచ్చనమే ఈ జాగా ఖాళీ చేయాలి. లేకపోతే" -బెదిరిస్తూ మాట్లాడాడు.

"ఈ జాగా మాది. మేమెందుకు ఖాళీ చేయాలి!" అంది సుశీల ధైర్యంగా, గట్టిగా.

"ఏయ్ ! ముసల్ది చాలా మాట్లాడుతుందిరా! అసలు సంగతేందో దానికి చెప్పు' అని అతడు పక్కనున్నతని వైపు చూశాడు. ఆనందరావు షర్టు మాత్రం వదలలేదు. పక్కనున్న అతడు ప్యాంటు జేబులోంచి ఏవో కాగితాలు తీసి తెరిచి చూపించాడు.

"ఈ కాగితాలు చూడు. అవి రిజిష్టర్ కాగితాలు. ఈ భూమీ, ఈ చుట్టుపక్కలున్న ఐదొందల ఎకరాల భూమి మా సేటు కొన్నాడు. పక్కన ప్లాట్లు చేస్తూ నాటిన రాళ్ళు సూడలే. ఈ భూమిలో రాళ్ళు పీకేయించి మీకు అమ్మింది ఎవడు వాడు?" ప్రశ్నించాడు అతడు.

"మరి ఇన్ని రోజులెందుకు రాలేదు మీరు. ఇంతకు కొనే ముందు వచ్చి ఎందుకు చెప్పలేదు మాకు!" అడిగింది సుశీల.

"ఆ పనంతా మాది కాదు. తెలిసిందా. ఇది మా భూమి. మీరు ఖాళీ చేసి పోవాలె. అది తెలుసుకో! రేపటివరకు ఇక్కడ మీరు కన్పించొద్దు"

"కన్పిస్తే ఏమైతదో వాడి చేతిలో ఉన్న కత్తి చూసి తెలుసుకోండి!" అన్నాడతడు.

నలుగురిలో ఒకతని చేతిలో మెరుస్తున్న పెద్ద కత్తి కన్పించింది. ఇంతసేపు ఆ కత్తిని చూడనేలేదు వాళ్ళు. వాళ్ళెట్లా నిశ్శబ్దంగా మెరుపుల్లా వచ్చారో అట్లానే మాయ మయ్యారు.

ఆనందరావు పూర్తిగా చలించిపోయాడు. సుశీలే కాస్త ధైర్యంగా ఉంది. లక్కయ్య అవాక్కయ్యాడు.

"ఈ జాగా వెంటనే ఖాళీచేసి పోదాం. చాలా ప్రమాదంగా ఉంది" అన్నాడు ఆనందరావు భయంలోంచి తేరుకుంటూ.

"అంత భయమెందుకండి పోలీసులకు రిపోర్టు ఇద్దాం. వాళ్ళు మనకు రక్షణనిస్తారు. లక్షలు పోసిన ఈ భూమిని వాళ్ళ చేతుల్లో ఎట్లా పెడతాం" అంది సుశీల.

"గా మనుషులు సేట్ మనుషులు. దేనికైనా తెగిస్తారు. చంపుడులు మానభంగాలు చేస్తారు వాళ్ళతో పెట్టుకోకండి సార్!" లక్కయ్య ఆనందరావు వైపు చూస్తూ అన్నాడు.

"ఈ భూమి సేటు దంటాడేమిటి! మేముకొనుక్కొని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాం గదా!"

"గది గదా సార్! గిక్కడ జరుగుతున్నది. ఒక్కొక్క భూమిని ఇద్దరు ముగ్గురి కమ్ము తున్నరు. ఇటు రైతులకు ఎంతో కొంత ఇచ్చి బ్రోకర్లు జేబులు నింపుకుంటున్నరు."

"మరి ఆ రైతు మాకు సంతకం చేసి రిజిస్ట్రేషన్ కూడా చేయించాడు కదా లక్కయ్యా!"

"ఆ రైతు ఎవరో ! భూమి ఎవరిదో ! బ్రోకర్లు దొంగ సంతకాలు చేయించి ఆఫీసు ల్లోకి పోయి దొంగముద్రలు వేయించి బయటికి వచ్చి రిజిస్ట్రేషను కాగితాలని చెప్పి చేతుల్లో పెడ్తున్నరు. అసలు మొదలు కొన్నవారికే ఈ భూమి చెందుతుంది. పట్నంల సేటు ఎవరో కొన్నడని మేము కూడా విన్నం. ఆయన మనుష్యులేనేమొ వీళ్ళు. సేటు తక్కువ పైసలిచ్చి ఈ భూమంతా కొన్నడు ఎన్నడొ. దీన్ల మా భూమీ ఎకరమంత ఉంది. ఏం జేస్తం పక్కనున్నోళ్ళు అమ్ముతుంటె మేమూ అమ్మినం. అమ్మితే వచ్చిన పైసలు అప్పు కిందికి సరిపోలేదు. ఇదిగో మళ్ళీ పొట్ట చేత బట్టుకొని తిరుగుతున్నం. మా భూమి అన్నది మాకు లేకుంటయింది. పక్షులమై పోయినం. కూలీనాలీకి దిగినం" అని చెప్తూ పోతున్నాడు లక్కయ్య.

"వ్యవసాయం భూములన్నీ తక్కువ ధరకు కొని ప్లాట్లుగా చేసి అమ్ముతున్నారని నాకు తెలుసు. కాని ఊరి బయట ఇంత దూరంగా ఇట్లా జరుగుతున్నదని అనుకోలేదు. అందులో కోటేశ్వరరావు పక్కింట్లో ఉండేవాడే. రైతును కూడా వెంట తెచ్చాడు. ఇట్లా జరుగుతుందని అనుకోలేదు" అన్నాడు ఆనందరావు.

"మీ పానాలు నిలువాలంటే జల్దీ ఖాళీ చేయండి సార్! ఒక్క క్షణం మీరిక్కడ ఉంటె పానాలకే ముప్పు" తొందరపెట్టాడు లక్కయ్య.

"ఒక్కసారి కోటేశ్వర్రావుతో రైతుతో మాట్లాడుతాను. అప్పుడు చూద్దాం" అన్నాడు ఆనందరావు.

"సరే ఇగ మీ ఇష్టం! నేను పోతున్న. పట్నం బస్సుకు పోయి అక్కడైనా కూలిపని దొరుకుతదేమో చూస్కుంట" అని లక్కయ్య వెళ్ళిపోయాడు. ఇంటికి తాళం వేసి సుశీల, ఆనందరావులు సరాసరి కోటేశ్వరరావు ఇంటికి బయలుదేరారు. పొద్దున్నుంచి తిండి తిప్పల్లేవు. వాళ్ళకసలు తిండి మీద ధ్యాసే లేదు. కడుపులో మలమల మాడిపోతున్నా ఇంత డబ్బు మట్టిలో పోసామే అన్న ఆలోచనే వాళ్ళను కాల్చేస్తున్నది. బస్ దిగి కోటేశ్వరరావు ఇల్లు చేరుకున్నారు.

"కోటేశ్వరరావు!" పిలిచాడు ఆనందరావు క్షీణ స్వరంతో. ఏం జవాబు రాలేదు. పక్కన బెల్లు ఉంటే గట్టిగా రెండుసార్లు నొక్కాడు. లోపల ఏం చప్పుడుగాని ఎవరైనా ఉన్నట్లు నడిచి వస్తున్నట్లు జాడలు గాని విన్పించలేదు, కన్పించలేదు.

"ఏం చేద్దాం !" నిస్పృహతో సుశీలవైపు చూసాడు ఆనంరావు. సుశీల పైటచెంగుతో కన్నీళ్ళు తుడచుకోబోయి వంగింది. అంతే ! కింద గడియకు తాళం కన్పించింది. నిశ్శబ్దంగా సుశీల దాన్ని ఆనందరావుకి చూపించింది.

"అంటే" అటూ యిటూ చూసాడు ఆనందరావు. ఇంతలో పక్కింట్లో నుంచి రామారావు బయటికి వచ్చాడు. ఆనందరావుకు అతడు పరిచయమే.

"ఆనందరావుగారూ! మీ తోట ఎట్లా ఉందండి. కూరగాయలు కాస్తున్నాయా! ఒకరోజు మీ తోటకు వచ్చి పొద్దంతా గడిపి ఇన్ని తాజా కూరగాయలు తెచ్చుకోవాలనుకుంటున్నాం. నేనూ మా ఆవిడ" అంటున్న రామారావుగార్ని ఆపి

"సరే కోటేశ్వరరావుగారు ఎక్కడికి వెళ్ళాడు" అడిగాడు ఆనందరావు.

"కోటేశ్వరరావా! ఆయన ఇల్లు మారాడు కదా! ఎక్కడికి వెళ్తున్నాడో కూడా మాకు చెప్ప లేదు. బేరాలు చేసే మనిషి ఒక్కచోట ఉంటే ఆయనకెట్ల నడుస్తుంది. అది సరే ! మీ తోట సంగతి చెప్పనే లేదు......" రామారావు మాటలు సుశీల, ఆనందరావుకు ఎక్కడి నుంచో విన్పిస్తున్నట్లుగా ఉన్నాయి. బోరుమని అక్కడే అతని ముందు ఏడిస్తే బాగుండదని అక్కడి నుండి గబగబా నడిచారు.

- ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం
*30 మే 1999, 6 జూన్ 1999, 13 జూన్ 1999*